ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 11 జూన్, 2026 | పేజీలు :08

## మత్తు రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు నేడు పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి దర్గా ప్రాంగణంలో ఈగల్ ఫోర్స్,అటవీ శాఖ మరియు పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం, మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి,ఏసీపీ జి. కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని వారు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్,ఈగల్ ఫోర్స్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక పెద్దలు,గంజాయి వినియోగదారులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశాన్ని అప్పుల పాలు చేసిన ప్రధాని





సిపిఐ
నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
కలెక్టర్ ఆఫీస్ ముందు సిపిఐ నేతల ఆందోళన
పోలీసులకు సిపిఐ నేతలకు మధ్య తోపులాట
జిల్లా కార్యదర్శి పంజాలకు స్వల్ప గాయాలు
చాడ, పంజాల సహా పలువురు నేతల
అరెస్ట్





## నెహ్రూ రికార్డు బద్దలు కొట్టిన మోదీ



కరీంనగర్ మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రదాన మంత్రి నరేంద్రమోదీ రాబోయే 2047 సంవత్సరం వరకు భారత ప్రధానమంత్రిగా కొనసాగుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోనే భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టే వరకు మోదీ విశ్రమించబోరని చెప్పారు. భారత ప్రధానిగా 4398 రోజులు పూర్తి చేసుకుని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం ఉదయం కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో స్థానిక బీజేపీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, అభివృద్ధిలో భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా క్రుషి చేస్తున్న మోదీకి భగవంతుడి ఆశీస్సులు అందించాలని కోరుతూ బండి సంజయ్ ఈ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించిన వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని, ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ చూసుకుంటుందన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజా పక్షం/ రుద్రంగి /వేములవాడ:** ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా పక్కాగా వేరు చేయాలని, పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయం, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, ఆయిల్ పామ్, రోడ్డు భద్రత, నియమాలు, గిరిజన సంక్షేమ శాఖ పథకాలు తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6న ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా 10 థీమ్ లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ –2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, మిషన్ భగీరథ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రెసిడెన్షియల్ విద్యాలయం పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/రుద్రంగి/వేములవాడ:**రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) విద్యాలయం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రుద్రంగి మండలం గైదిగుట్ట తండా ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్) భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ తరగతి గదులు, హాస్టల్ భవనం, ఇతర నిర్మాణ పనులను పరిశీలించి. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్, అధికారులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరిత గతిన వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. పరిశీలనలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంగీత, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

**ప్రజాపక్షం/ముత్తారం:**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలో గల నాలుగో వార్డులో ఒక విద్యుత్ స్తంభం తీవ్రంగా ఒకే వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది.పోలవేన సదానందం ఇంటి సమీపంలోని పంట పొలం వద్ద ఉన్న ఈ విద్యుత్ స్తంభం ఏ క్షణంలోనైనా విరిగిపడేలా ఉండడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు,గాలిదుమారాలకు ఈ స్తంభం కూలిపోతే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ,వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి,తక్షణమే స్పందించి ఒరిగిన స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి తమ ప్రాణాలను కాపాడాలని ఓడేడు గ్రామ నాలుగో వార్డు ప్రజలు వేడుకుంటున్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకంక్షలు తెలిపిన కవ్వంపల్లి మహా కుటుంబం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా బుధవారం కవ్వంపల్లి మహా కుటుంబం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మహా కుటుంబం సమన్వయకర్త కవ్వంపల్లి భూమేష్, సభ్యులు కవ్వంపల్లి కనకరాజు, కవ్వంపల్లి సంజీవ్, కవ్వంపల్లి వేణు కుమార్, డా.కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన టిపిసిసి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న సాజిద్, వాజిద్‌ల తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ధైర్యం చెప్పి,ఈ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబొద్దీన్ పాషా,ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు నల్లూరి సాగర్, వెంకటగిరి,బైర్ల శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవనానికి తాళం వేసిన కాంట్రాక్టర్



**ప్రజా పక్షం/ కోనరావుపేట/ వేములవాడ:** కోనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి బుధవారం కాంట్రాక్టర్ ఆడేపు మల్లారెడ్డి తాళం వేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణం పనులు పూర్తిచేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా తనకు రావలసిన లక్ష యాభై వేల రూపాయల బిల్లు ఇప్పటికి చెల్లించలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మంజూరైన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించడానికి 20 లక్షల రూపాయలకు ఒప్పందం కోరుకున్నట్లు సమాచారం ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం భవనం డబ్బులు సరిపోకపోవడంతో అదనంగా ఒక లక్ష యాభై వేల రూపాయలు అవుతాయని మాజీ సర్పంచ్, పాలకవర్గం సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు గ్రామ మండల అధికారులు బిల్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని. నిర్మాణం పూర్తయిన తర్వాత భవనానికి వేసిన కలర్ నచ్చలేదని రెండోసారి కలర్ కూడా వేయించారని డబ్బుల కొరకు ఇబ్బంది గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామ పాలకవర్గాన్ని నా బిల్లు ఇప్పించే విధంగా వేడుకుంటున్నానని కాంట్రాక్టర్ మల్లారెడ్డి తెలిపారు.

## పేద కుటుంబానికి అండగా వ్యాల్ల హరీష్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మాతంగి కాలనీకి చెందిన సింహరాజు శివకుమార్ గత నెల 30న ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శివకుమార్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి మానవత్వంతో ముందుకు వచ్చి వారి కుటుంబానికి అండగా నిలిచారు.శివకుమార్ పెద్దకర్మ సందర్భంగా మాతంగి కాలనీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి రూ.10,000ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా శివకుమార్ కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో సహాయం చేసిన హరీష్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం హరీష్ రెడ్డి ప్రత్యేకత అని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంకల దేవేందర్, బూరుగు వంశీ కృష్ణ, జెట్టి చందు,రాచర్ల సాగర్,వెజ్జ సదన్,తదితరులు పాల్గొన్నారు.

## యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం మన అందరి బాధ్యత అని పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని హనుమంతునిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు,రోడ్డు సేఫ్టీ,హెల్మెట్ వినియోగం,సీటబెల్ట్ ధరించడం,నిర్లక్ష్యపు డ్రైవింగ్,మైనర్ డ్రైవింగ్,గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం,గురువుల పట్ల భక్తి కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల వ్యసనం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని,డ్రగ్స్‌కు అలవాటు పడిన పిల్లల్లో ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని తెలిపారు.ఇంట్లో వస్తువులు ధ్వంసం చేయడం, తల్లిదండ్రులను బెదిరించడం, అవసరం లేని డిమాండ్లు చేయడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. అటువంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, పోలీసులు అవసరమైన కౌన్సెలింగ్ అందించడమే కాకుండా వైద్య నిపుణులు, మనోవైద్యుల సహాయంతో పిల్లలను సరైన మార్గంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని డీసీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత,ఆరోగ్య శాఖ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, విద్యాశాఖ ప్రధానోపాధ్యాయులు,నీటిపారుదల శాఖ అధికారులు,విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం.!

**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన పుట్ట మధుకర్‌ను ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డ బస్టాండ్ ఆవరణలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ లు మాట్లాడుతూ.. పుట్ట మధుకర్.. ఖబడ్దార్! మంత్రిపై వ్యక్తిగత విమర్శలు మానుకో అంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబుపై ఆధారరహిత ఆరోపణలు,అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ హుందాతనం పాటించాలని, ఇలాంటి వ్యక్తిగత దూషణలను ప్రజలు ఎప్పటికీ సమర్థించరని స్పష్టం చేశారు.ఇప్పటికైనా నిందారోపణలు ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుపై అమర్యాదగా మాట్లాడితే సహించం

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై వ్యక్తిగతంగా, అమర్యాదకరంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు సహించబోరని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ కమ్మగోని చౌదరి గౌడ్ హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లిలో చౌదరి గౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన పుట్ట మధు తన రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజా సమస్యలు,అభివృద్ధిపై మాట్లాడలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.శ్రీధర్ బాబు గురించి మాట్లాడే అర్హత పుట్ట మధుకు లేదన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిపై బురదజల్లడం ఆయన రాజకీయ బలహీనతకు నిదర్శనమని, ప్రజల మద్దతు కోల్పోయిన నాయకులు ఇప్పుడు ఆరోపణలతోనే వార్తల్లో నిలవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు.గతంలో ప్రజలు పలుమార్లు తిరస్కరించినప్పటికీ అదే అహంకార ధోరణితో వ్యవహరించడం పుట్ట మధు రాజకీయ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పుట్ట మధు హద్దులు దాటి వ్యవహరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చౌదరి గౌడ్ స్పష్టం చేశారు.

## రైతులకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించడంలో తమ పాలకవర్గం ముందుంటుందని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం బుధవారం జరుగగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వేసేటువంటి పంటకు సంబంధించిన విత్తనాలు నాణ్యమైనవి ఎంచుకొని మంచి దిగుబడి వచ్చేటువంటి పంటలను ఎంచుకొని రైతులు అధిక లాభాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ

**ప్రజాపక్షం/జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు సభ కౌన్సిలర్ కోలుగూరి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ వార్డులో ఎదురయ్యే సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన లబ్దిదారులకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేవిధంగా ప్రభుత్వానికి ఇటు వార్డు ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ గజ్జెల క్రాంతి కుమార్, బిఆర్ ఎస్ వార్డు అధ్యక్షులు శ్రీకాంత్, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ , జమ్మికుంట విద్యుత్ ఏఈ, ప్రజా ప్రతినిధులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన వొడితెల ప్రణవ్

**ప్రజాపక్షం /హుజురాబాద్ :** కమలాపూర్ మండలం ఉప్పల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్ మంగళవారం బహుమతులు అందజేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వ్యాపారవేత్త స్వర్గం రవి తన తల్లి దండ్రులు కీ.శే. స్వర్గం సరోజన రాజేశ్వర్ రావు స్మారకార్థం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌లో వివిద మండలాల నుండి సుమారు 30 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హుజురాబాద్ జట్టు విజేతగా నిలవగా రన్నరప్ ఉప్పల్ జట్టు నిలిచింది. విజేతలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, స్పాన్సర్ రవిలు ఆకర్షణీయమైన ట్రోఫిలతో పాటు మొదటి బహుమతిగా రూ.లు 50వేలు, రెండో బహుమతిగా 25వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామనాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రవీందర్, ఉప సర్పంచ్ సిద్దార్థ, వార్డు సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## బెల్లం పానకం ధ్వంసం చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని కల్వల గ్రామ శివారులో క్వారీ గుట్ట మీద 900 లీటర్ల బెల్లం పానకాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ధ్వంసం చేశారు. శంకరపట్నం మండలం కల్వల గ్రామ శివారులో క్వారీ గుట్టల వద్ద నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన లోకిని స్వామి గుట్ట వద్ద నాటు సారా తయారు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల రాకను గమనించి ద్విచక్ర వాహనాన్ని వదిలిపెట్టి పారిపోయారు. టాస్క్‌ఫోర్స్ సిఐ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి నాటు సారా తయారు చేసేందుకు డ్రంబులో 900 లీటర్ల బెల్లం పానకం ఉండగా దాన్ని ధ్వంసం చేశారు. క్యాన్లో ఉన్న 20 లీటర్ల నాటు సారను, 5 కేజీల బెల్లాన్ని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోన్నారు. పరారైన లోకిని స్వామిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాజు, సతీష్, రాజేందర్ లు ఉన్నారు.

## కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం ఆచంపల్లి గ్రామంలో నూతన కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాలమేరకు స్థానిక సర్పంచ్ ఆరే తేజశ్రీ రాజశేఖర్ గ్రామ రైతులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు పురుమల్ల మనోహర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన సిఐ రామకృష్ణ గౌడ్

**ప్రజాపక్షం/జమ్మికుంట :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని సైదాబాద్ గ్రామంలో జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించి 100 మొక్కలను నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడం, రహదారి భద్రత చర్యలపై చైతన్యం కలిగించడం కోసం మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని అరైవ్ అలైవ్ రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేశ్, సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం..




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని జిల్లా ఎస్పీమహేష్ బి. గితే తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలనపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు. సిరిసిల్ల సబ్–డివిజన్ పరిధిలో గత రెండు నెలల కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టడం,ఇల్లంతకుంట,వీర్నపల్లి మండలాల్లో జీరో ప్రమాదాలు నమోదు కావడం సంతోషకరమైన పరిణామమన్నారు. గడిచిన సంవత్సరంలో మొదటి మూడు నెలలతో పోల్చుకుంటే రెండు నెలల్లో సిరిసిల్ల సబ్–డివిజన్ పరిధిలో 42 శాతం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గడం పట్టిందన్నారు. ఇల్లంతకుంట,వీర్నపల్లి మండలాల్లో జీరో ప్రమాదాలు నమోదు కావడం ప్రజల అవగాహనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు గ్రామాల్లో ఉన్న రహదారి భద్రతా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నాగేంద్రచారి,వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, ఎస్.ఐ లు నాగరాజు, ఉపేందర్, ఎంవిఐ వంశిధర్, ఏఎంవిఐ పృధ్వీరాజ్ వర్మ,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## వార్డు సమస్యలపై చైర్మన్‌కు వినతి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని 8వ వార్డులో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి గూడెపు వంశీకృష్ణ వార్డులోని పలు ప్రధాన సమస్యలపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కేరళ స్కూల్ ఎదురుగా గల సందీప్ కిరాణం వెనుక ఉన్నటువంటి ఇట్టం సిద్దిరాములు గల్లీలో మున్సిపల్ స్ట్రీట్‌లైట్లు, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉండి వాయిదా పడుతూ వస్తున్న రోడ్డు సమస్యలు పరిష్కరించాలని, మారుతినగర్‌లోకి వెళ్లే చత్రపతి శివాజి బొమ్మ నుంచి ప్రభుత్వ గిడ్డంగుల దాకా ఉన్న ప్రధాన రోడ్డును 30 ఫీట్ల సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని ఇదివరకే స్థలం కేటాయించిన అంగన్వాడీ కేంద్రాన్ని త్వరితగతిన నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని, రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంటుకొని మారుతినగర్ మురికి కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. మారుతినగర్ కోసం ప్రత్యేక రేషన్ షాపును కేటాయించాల్సిందిగా జిల్లా పౌరసరఫరాల అధికారులకు అభ్యర్థించాలని , పంచముఖ హనుమాన్ దేవాలయం సమీపంలో ప్రభుత్వ గిడ్డంగుల దగ్గర హైమాస్ ల్యాంప్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేరోన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోలుగురి సురేష్, వార్డు ఆఫీసర్, మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్, మహిళా సంఘాల ఆర్పీలు, వివిధ పార్టీల కార్యకర్తలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలల ప్రారంభోత్సవం పండగలా నిర్వహించాలి




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఈ విద్యా సంవత్సరం ఈనెల 15 న ప్రారంభం కాబోతున్న సందర్భంగా బడిబాటను నిర్వహించి గత సంవత్సరాని కంటే ప్రతి పాఠశాలలో 10 శాతం విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని, పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పండగల నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లతో జరిగిన సన్నాహక సమావేశంలో డీఈవో ప్రశాంత్ రెడ్డి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని మధ్యాహ్న భోజనము సుచి శుభ్రతతో కూడినది అందించాలన్నారు. పాఠశాలలో ఎలక్ట్రిసిటీ/ విద్యుత్తు వసతులన్నీ ఉండేలా చూడాలని, టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ అందించాలని, పర్ఫామెన్స్ గ్రేట్ ఇండెక్స్ లో జిల్లాను ముందు వరుసలో ఉంచే విధంగా చూడాలన్నారు. నూతనంగా ఎంపికైన పూర్వ ప్రాథమిక పాఠశాలలో ఆయా మరియు ఇన్స్ట్రక్టర్ల నియామక ప్రక్రియ జరుగుతుందని వాటికి పెయింటింగ్స్ మరియు ఫర్నిచర్ త్వరలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు, డి సి ఈ బి సెక్రటరీ, పరీక్షల విభాగాధికారి మొదలగు వారు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎల్లారెడ్డిపేట వలయాధికారి వెంకటేష్, ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షిస్తే భవిష్యత్తులో మానవ మనుగడకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. తమ ఇండ్లలో, రహదారుల ప్రక్కన చెట్లను నాటి వాటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నూతన ఎస్ఐ 2 అబ్దుల్ రజాక్, హెడ్ కానిస్టేబుల్ షబ్బిర్అలీ, యాకుబ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రజాపాలన గ్రామ సభలు



**ప్రజాపక్షం/శంకరపట్నం :** శంకరపట్నం మండలంలో ప్రజాపాలన గ్రామ సభలు బుధవారంతో ముగిశాయి. శంకరపట్నం మండలంరని ఎర్రడపల్లి, అరకండ్ల, అంబేడ్కర్ నగర్, కాచాపూర్, లింగాపూర్, కల్వల, మెట్టుపల్లి, ఆముదాలపల్లి, చింతలపల్లి, మొలంగూర్ గ్రామాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు జరిగాయి. గ్రామాలలో తాగునీరు, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, శాంతి భద్రతలు తదితర సమస్యలపై అధికారులు గ్రామస్థులకు వివరించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త బండ్లకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందించాలని ఎంపిడివో పనాస అనిత సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, ఎంపిఓ ప్రభాకర్, ఏవో వెంకటేశ్, ఎస్సై శేఖర్ రెడ్డి, ఏపీవో శారద, సర్పంచులు కొయ్యడ రజిత, ఊకంటి మాధవి, లావణ్య, పులికోట ప్రేమలత, పూదరి స్వరూప, మొగిలి, కుమార్ యాదవ్, అనూష, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీపై అవగాహన

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామంలో బుధవారం అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే వేగ పరిమితులను పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులతో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బస్టాండ్ తనిఖీ చేసిన డిఎం

**ప్రజాపక్షం/శంకరపట్నం :** శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ను హుజురాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్ లోకి వచ్చిన ఆర్టీసీ బస్సులలో తనిఖీ చేసి టికెట్లను పరిశీలించారు. అనంతరం బస్టాండ్ లోని వసతులపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రయాణికులకు తాగు నీటి సమస్య ఉండకూడదని సిబ్బందికి సూచించారు. డిపో మేనేజర్ తోపాటు సిఐ ఏంజలీనా, సిబ్బంది ఉన్నారు.

## మత్స్యగిరీంద్ర స్వామి ఆలయంలో నాటిన మొక్కలు

**ప్రజాపక్షం/శంకరపట్నం :** శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం చేపట్టాలని మత్స్యగిరీంద్ర స్వామి గుట్టపై మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి వాటిని పరరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో అలయ చైర్మన్ కోరం రాజిరెడ్డి, ఈవో వెంకన్న, మాజీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి,సర్పంచ్ సుజాత, ధర్మకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాపక్షం/రాయికల్ : విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. రాయికల్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం 10వ వార్డు లో "వార్డు సభను మేరు సంఘ భవనంలో నిర్వహించారు. వర్షాకాలంలో ఏర్పడే ముందస్తు చర్యలు,తడి చెత్త పొడి చెత్త సేకరణ,పర్యావరణ పరిరక్షణ,నీటి పొదుపు,ఇంకుడు గుంతల ఏర్పాటు,మహిళల సంరక్షణ,అరైవ్ ఎ లైవ్,ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.మహిళ గ్రూప్ సభ్యులకు ఇందిరమ్మ చీరను పంపిణీ చేశారు.వార్డు లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలి



పారు.అనంతరం పదో వార్డు కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి ఆధ్వర్యంలో పదవ తరగతి,ఇంటర్మీడియట్,పాలిటెక్నిక్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులను సాల్వతో ఘనంగా సన్మానించి కాలేజీ బ్యాగులను అందించారు.10మంది చిన్నారులకు పలక,వాటర్ బాటిల్, స్లేట్ పెన్సిల్ బాక్స్ అందించి అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూవిద్యార్థులు,యువత ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలంటే విద్య ఒక్కటే మార్గమని అలాంటి విద్యను ప్రణాళికతో చదివితే ఫలితాలు సాధించవచ్చని అన్నారు.తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను వృధా చేయకుండా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు.విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారికి ఇష్టం ఉన్న రంగాన్ని ప్రోత్సహించి విజయం సాధించేలా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ము న్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ హరీష్, సుష్మ,వార్డు అధికారి ప్రత్యూ ష, నాయకులు మచ్చ శేఖర్, బాపురపు నరసయ్య, రాజీవ్,లింగంపల్లి సుభాష్,కాశవేణి రాజేష్ ,రాంప్రసాద్,గంగారెడ్డి, మల్లేష్, మెప్మా సుజా త,అ నూష, శ్యామల,అంగన్వాడి ఉపాధ్యాయులు ఉమా, పుష్పలత,ఏ ఎన్ ఎం ఫాతిమా,వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు ప్రజలకు చేరయడంలో ముందుంటా



ప్రజాపక్షం/మల్లాపూర్ : బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ప్రస్తుత ప్రభుత్వం అమ లు చేస్తుందని వాటిని ప్రజలకు చేరవేయడంలో ముందుంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకు ంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చేపట్టిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హాజరుకాని లబ్ధిదారులకు తానే స్వయంగా అందిస్తానని సమావేశంలో చెప్పి బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో హాజరు కాకు ండా మిగిలిపోయినా లబ్ధిదారులకు స్వయంగా ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామ్ చందర్ సర్పంచ్లు చిట్యాల లక్ష్మ ణ్ తోట శ్రీనివాస్, గోండ రాజేందర్,నాయకులు రాంరెడ్డి రెవిన్యూ ఇబ్బంది,తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు భవిష్యత్తు



ప్రజాపక్షం/మల్లాపూర్: గ్రామాల్లో ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని కుస్తాపూర్ గ్రామ సర్పంచ్ జెల్లా రాజేశ్వర్ ఉపసర్పంచ్ సరికేల మహిపాల్ అన్నారు.ఈ సందర్భంగా బుధవారం గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రైవేట్ పాఠశాలలో చేరకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ప్రైవేట్ పాఠశాలలు ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెల్లా రాజేశ్వర్,ఉప సర్పంచ్ సరికేల మహిపాల్ ,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అంగన్వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో వార్డు సభలు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం 2, 3 మరియు 13వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు.2, 3వ వార్డుల సభను మాల సంఘం భవనంలో, 13వ వార్డు సభను రేగుంటలో నిర్వహించారు.వార్డు సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మున్సిపాలిటీ చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, మురికి కాలువల పూడికతీత, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ,ఘన వ్యర్థాల నిర్వహణ,ఓటరు నమోదు,తాగునీటి సరఫరా, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన



కల్పించారు.ప్రజల భాగస్వామ్యంతో వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఈ నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజ్‌కుమార్,సంబంధిత వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్మణ్‌కుమార్‌పై విమర్శలు మానుకోవాలి



ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు మంత్రి పదవిలో ఉండడాన్ని కొందరు రాజకీయ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని,మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం విమర్శించారు.జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, ఎమ్మార్ పిఎస్ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాంలు మాట్లాడారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు.మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మంత్రి కావడం కొందరికి నచ్చడం లేదని, అందుకే అనవసర విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌ను గురువుగా భావి ంచే నాయకులు,కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత స్థాయికి దిగజారి విషపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.మాదిగల సామాజిక, రాజకీయ సాధికారత కోసం మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని వారు అన్నారు. ఆయనపై చేసే నిరాధార ఆరోపణలను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ఉద్యమపరంగా తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చేట్‌పల్లె లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, కౌన్సిలర్ దుమాల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు భువనగిరి కిషన్, బొల్లె అనిల్, సోషల్ మీడియా జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి నక్క సతీష్, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్,నియోజకవర్గ కోఇన్‌చార్జి పొడేటి సునీల్, మారంపల్లి శంకర్,దాసరి సతీష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్: జగిత్యాల పట్టణంలోని వాణీనగర్‌లో నిర్వహించిన శ్రీ గంగమ్మ జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు.అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆకాంక్షించారు. గంగమ్మ తల్లి నామస్మరణలతో వాణీ నగర్, బీట్ బజార్, తులసి నగర్ ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. మాజీ మంత్రి



జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్,జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత,మున్సిపల్ చైర్ పర్సన్ సమీంద్ల వాణి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి,బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు శ్రావణి,తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం నాయకులు ఉన్నారు

## నీటి సమస్య తీర్చిన మంత్రి



ప్రజాపక్షం/గొల్లపల్లి :కొస్నపల్లి గ్రామంలో తాగు ,నష్టి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్న మంత్రి అడ్లూరి కోస్న పల్లి వాసులకు బాసటగా నిలిచారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రంగధాముపల్లి గ్రామ పరిధిలోని కోసనపల్లిలో తాగునీటి లభ్యత లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్ జెల్ల అఖిల సమస్యను మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్య తీవ్రతను గుర్తించిన మంత్రి లక్ష్మ ణ్ కుమార్ వెంటనే స్పందించి అవసరమైన నిధులను మంజూరు చేయడంతో కోసనపల్లిలో బోర్‌వెల్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. తక్షణ స్పందనతో నీటి సమస్యను పరిష్కరించినందుకు మంత్రి లక్ష్మ ణ్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు . అలాగే గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ జెల్ల అఖిల సేవలను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జెల్ల అనిల్ యాదవ్,ఉప సర్పంచ్ ఎలగందుల శ్రీనివాస్, వార్డు సభ్యులు కాంచెట్టి తిరుపతి, కొండ లక్ష్మీ గంగయ్య, కాసారపూ సతీష్, నలవాల లక్ష్మి పోచమల్లు, నల్వాల తిరుపతి భాగ్య, వేములవాడ లాస్య శ్రీనివాస్, నాయకులు ఎనగందుల కమలాకర్, గ్రామస్తులు నలువాల హరిష్,పెరవేణి స్వామి,పెద్దూరి రవీందర్,జగిశెట్టి బుచ్చయ్య,అడిశర్ల రాజయ్య,సామల వెంకయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ నడిమెట్ల మహేందర్,జీపీ సిబ్బంది మల్లేశం,రమేష్,బిరుదుల చంద్రయ్య ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం సోమన్ పెల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలను గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని బారి ఊరేగింపు నిర్వహించారు. యువతీ,యువకులు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.అనంతరం పోచమ్మ తల్లి ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెవుల గంగన్న, ఉప సర్పంచ్ గొనె మల్లేశం, నాయకులు ఎర్ర గంగ సాగర్, గర్వకుర్తి భూమయ్య, కంది అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నీలం అంజి,కుందారపు గంగన్న, గొనె గంగన్న, బత్తిని మహేందర్,కుందారపు అంజన్న,తదితరులు ఉన్నారు.

## ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం

ప్రజాపక్షం/మెట్‌పల్లి :ఇటీవల ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి వేంపేట గ్రామానికి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను మార్గదర్శి కాన్వెంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు మార్గదర్శి కాన్వెంట్ స్కూల్‌లో చదివిన ఈ విద్యార్థులు అనంతరం ప్రభుత్వ,గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించి విశేష ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ పాఠశాలలపై కొందరిలో ఉన్న చిన్నచూపును ఈ విద్యార్థుల విజయాలు తొలగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎంసెట్‌లో వెల్మల స్నూర్తిక 1166 ర్యాంకు, ఏలేటి హర్షిని 1278 ర్యాంకు,మారు హవీలా 1500 ర్యాంకు సాధించగా, చుక్కబొట్ల మాధురి బీఈడ్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 364 ర్యాంకు సాధించింది. అదేవిధంగా ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న మార్గదర్శి కాన్వెంట్ స్కూల్ విద్యార్థుల్లో 10 మంది గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడం పాఠశాలకు గర్వకారణమని నిర్వాహకులు పేర్కొన్నారు.పాఠశాల కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కృషి చేసి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.చిన్నతనం నుంచే పుస్తక పఠన అలవాటు పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు విజయాలను అందుకుంటారని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు ఇప్పటికే వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ప్రస్తుత విద్యార్థులు కూడా అదే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏలేటి తిరుపతి రెడ్డి,మారు రామ్ రెడ్డి,వెల్మల ముత్యం,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ప్యాకెట్లు పట్టివేత ఏడుగురు అరెస్ట్



**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన హైవే పెట్రోలింగ్‌లో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కిరణ్ తన సిబ్బందితో పాటు నార్కోటిక్ టీం ఇన్‌చార్జి సతీష్, నార్కోటిక్ డాగ్ 'సింబ', డాగ్ హ్యాండ్లర్ వేణుగోపాల్‌తో కలిసి హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో హాజీపూర్‌లో ఒకచోట అనుమానాస్పదంగా గుమిగూడి ఉన్న ఏడుగురిని గుర్తించారు. వెంటనే నార్కోటిక్ డాగ్ సాయంతో తనిఖీలు నిర్వహించగా వారి వద్ద 19 గంజాయి ప్యాకెట్లు లభించాయి. మొత్తం 74 గ్రాముల గంజాయితో పాటు ఆరు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్‌లు, నార్కోటిక్ టెస్ట్ కిట్‌ల సహాయంతో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాజీపూర్ మండలంలో ఎవరైనా గంజాయి సేవిస్తున్నా లేదా విక్రయిస్తున్నా ఆ సమాచారాన్ని ప్రజలు పోలీసులకు తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వరి కొయ్యలు కాల్చొద్దు



**ప్రజాపక్షం/హాజీపూర్ :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంట కోతల అనంతరం పొలాల్లో వరి కొయ్యలను కాల్చవద్దని, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. హాజీపూర్ మండలంలోని బుద్ధిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ దుర్గం సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ ఏఓ కృష్ణ, ఏడీఏ మామిడి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి పంటల వైవిధ్యీకరణ వైపు మొగ్గు చూపాలని కోరారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న వరి సన్న రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, నిరంతర తాగునీటి సరఫరా, హరితహారంలో భాగంగా మొక్కల నాటడం, ఓటరు జాబితా సవరణ, ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వైద్యుల సంఘం నుంచి రవికుమార్ శాశ్వత బహిష్కరణ



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణ ఆర్ఎంపి, పిఎంపి అనుభవ వైద్యుల సంఘం సభ్యుడు తాటికొండ రవికుమార్‌ను సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తూ సంఘ కార్యవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సంఘ క్రమశిక్షణా నియమావళిని ఉల్లంఘించడమే కాకుండా రాష్ట్ర, పట్టణ కార్యవర్గ సభ్యులను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం ద్వారా సంఘ ప్రతిష్ఠకు భంగం కలిగించిన నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు సంఘ నాయకులు వెల్లడించారు. సంఘ కార్యవర్గ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించి, రవికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆయనను మందమర్రి పట్టణ ఆర్ఎంపి, పిఎంపి అనుభవ వైద్యుల సంఘం శాశ్వత సభ్యత్వం నుంచి తొలగించడంతో పాటు సంఘం నుంచి పూర్తిగా బహిష్కరించినట్లు ప్రకటించారు. ఇకపై తాటికొండ రవికుమార్‌కు సంఘంతో ఎటువంటి సంబంధం లేదని, సంఘం తరపున మాట్లాడే, ప్రాతినిధ్యం వహించే లేదా సంఘం పేరును ఉపయోగించే హక్కు లేదని స్పష్టం చేశారు. సభ్యులందరూ సంఘ నియమావళిని గౌరవించి, సంఘ ప్రతిష్ఠను కాపాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ప్రకటనను సంఘ అధ్యక్షులు, కార్యదర్శి గోనె గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, గౌరవ అధ్యక్షులు పోషం, కట్ల శ్రీనివాస్ విడుదల చేశారు.

## ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో కాగజ్‌నగర్ ప్రాంత ఉద్యమకారులకు సరైన గుర్తింపు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు గుర్తింపు కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలి, మలి విడత తెలంగాణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులు కాగజ్‌నగర్ ప్రాంతంలో ఉన్నారని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. గుర్తింపు ప్రక్రియలో అన్ని సంఘాలతో పాటు తెలంగాణ ఉద్యమకారుల వేదికను కూడా భాగస్వామ్యం చేసి సమాచారం అందించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రొఫెసర్ కోదండరాం తప్పకుండా సమాచారం ఇస్తామని హామీ ఇచ్చారు. కాగజ్‌నగర్ ప్రాంతంలో కూడా నిజమైన ఉద్యమకారులను గుర్తించి, జాబితా తయారు చేయాలతెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వర్ రావుతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కాంబ్లే

**ప్రజాపక్షం/వాంకిడి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కాంబ్లే పేర్కొన్నారు. ఇటీవల చైర్మన్‌గా నియమితులైన ఆయనను వాంకిడి గ్రామ సర్పంచ్ చునర్కర్ సతీష్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో చైర్మన్‌కు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ కాంబ్లే మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు అవసరమైన పుస్తకాలు, పోటీ పరీక్షల అధ్యయన సామగ్రి, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల గ్రంథాలయాలను మరింత బలోపేతం చేసి పఠన సంస్కృతిని పెంపొందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ చెప్పారు. వాంకిడి గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇస్తూ, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చునర్కర్ సతీష్ వాంకిడి ప్రజలకు ఆధునిక గ్రంథాలయ సేవలు అందేలా డిజిటల్ లైబ్రరీ సౌకర్యం కల్పించాలని కోరారు. వార్డు సభ్యులు మండోకర్ తుర్సుబాయి, ఇటంకర్ రాము, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మండోకర్ అనిల్ పాల్గొన్నారు.


## నేల ఆరోగ్యంతోనే కుటుంబ సంక్షేమం

### హోం సైన్స్ శాస్త్రవేత్త డా. ప్రియ సుగంధి

**ప్రజాపక్షం/మందమర్రి :** రైతుల ఆర్థికాభివృద్ధితో పాటు కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు నేల ఆరోగ్యం, ప్రకృతి వ్యవసాయం, పోషకాహారం కీలకమని హోం సైన్స్ శాస్త్రవేత్త డా. గెడ్డం ప్రియ సుగంధి పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామపంచాయితీ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు కుటుంబాలు పోషకాహార లోపాలకు గురికాకుండా రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలను చేర్చుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పోషకాహార తోటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మామిడి, టమాటాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్లో విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం, అధిక లాభాలు సాధించవచ్చన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అవసరమని, ప్రభుత్వ పోషకాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేల ఆరోగ్య పరిరక్షణకు మట్టి పరీక్షలు నిర్వహించి, ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని తెలిపారు. అధిక మోతాదులో యూరియా వాడితే నేల సారవంతత తగ్గిపోతుందని హెచ్చరించారు.వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. రాజశేఖర్, సర్పంచ్ సేగ్యం వెంకటేష్, ఉపసర్పంచ్ సుద్దుల రాజేశ్వరి, అధ్యక్షురాలు అబ్బోజు సంజన, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



## మృగశిర : రైతు పోలం బాట



**ప్రజాపక్షం/మావల:** మృగశిర కార్తె ప్రవేశించడంతో జిల్లాలోని రైతాంగం కొత్త ఆశలతో పొలాల బాటు పట్టింది. వానదేవునిపై భారం వేసి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు పనులను ప్రారంభించింది. ఒక వైపు పెట్టుబడుల కోసం అప్పులు సొప్పులు చేస్తూనే, మరోవైపు గుంపెడు ఆశలతో పత్తి విత్తనాలు నాటే పనిలో నిమగ్నమైంది. వ్యవసాయ సీజన్‌లో మృగశిరను తొలి కార్తెగా నమ్మె రైతులు, పొడి నేలల్లో (దుబ్బల్లో) విత్తనాలు వేయడానికి మొగ్గు చూపుతారు. వర్షాలు పడకముందే విత్తనాలు వేసుకోవడం వల్ల, తొలి చిన్నపాటి జల్లులు పడినా విత్తనాలు త్వరగా, బలంగా మొలకెత్తుతాయని సమాచారం. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే పొలం తడిగా మారి విత్తనాలు పెట్టడం ఆలస్యమవుతుందని, అందుకే ఈ దుబ్బ సాగు పద్ధతిని పాటిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎంత ముందుగా విత్తనాలు పెడితే అంత ఎక్కువ దిగుబడి వస్తుందనే నమ్మకంతో పనులను వేగవంతం చేశారు. గత ఏడాది పెట్టుబడులు భారీగా పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అయినప్పటికీ, ఆ నష్టాలను మరిచి ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగును మరింత పెంచేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ సంవత్సరమైనా వాతావరణం అనుకూలించి, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

## రోడ్డు భద్రతకు పోలీసు శాఖ వినూత్న చర్యలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ బుధవారం ప్రారంభించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించిన ఆయన, శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పోలీసు క్వార్టర్స్ ప్రాంగణంలో చిల్డ్రన్ పార్క్‌ను, ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కార్ హైడ్రాలిక్స్ వ్యవస్థను ప్రారంభించారు. తదుపరి కొమురం భీమ్ చౌరస్తా వద్ద నూతన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించి, ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు విశేష స్పందన

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 23, 24, 25, 27, 29, 30 వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా అధ్యక్షతన, కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభల్లో ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. వార్డు నంబర్ 27లో జరిగిన సభలో జిల్లా కలెక్టర్ కె. హరిత పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వార్డుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి అనిత, కౌన్సిలర్లు బైరిశెట్టి రవి, దుర్గం సూరజ్, సిద్ధం రాజేశ్వరి, మాణిక్య రావు, గజ్జి స్వాతి, మున్సిపల్ సిబ్బంది, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూలోలంలో ప్రత్యేక గ్రామసభ

### పారిశుద్ధ్యం, పర్యావరణంపై అవగాహన

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని న్యూ లోలం గ్రామ పంచాయితీలో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి, శ్రీనివాస్, జిల్లా స్థానిక సంస్థల అదనపు అధికారి, లింగయ్య, ఎంపిడీఓ అరుణ, ఎంపిఓ గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ శ్రీలత అధ్యక్షఇతన జరిగిన ఈ సభలో అధికారులు, గ్రామస్తులు పెద్ద సంక్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు గ్రామాల్ల పారిశుద్ధ్యం ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాదులు, రాకుండా కాపాడుకోవచ్చని సూచించారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

గ్రదామ సభ అనతరం జిల్లా, మండల అధికారులు గ్రామంలో నిర్మిస్తున్న వి.ఓ.ఏ. భవన నిర్మాణ ప్రగతి పనులకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంక్ ను కూడా వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి, రాజశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ శివకుమార్, ఏపిఓ, ఏపిఎం, బోసు, హౌజింగ్ ఏఈ, సనా ఫాతిమా, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వివిద శాఖల అధికారులు గ్రామ పాలకవర్గం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్ని బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తున్న ఎన్‌డీసీసీ బ్యాంకు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** అన్ని బ్యాంకుల కంటే అధిక వడ్డీనిస్తున్న మన ఎన్‌డీసీసీ బ్యాంకు అని డీసీఓ ఎన్.శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) ఆధ్వర్యంలో నూతన డిపాజిట్ పథకం సంపద పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోనే అత్యధిక వడ్డీ రేటును అందిస్తున్న ప్రత్యేక డిపాజిట్ పథకం సంపద ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంతో సాధారణ డిపాజిటర్లకు 8.00 శాతం వార్షిక వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం వార్షిక వడ్డీ అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న డిపాజిట్ పథకాలతో పోలిస్తే అత్యధిక వడ్డీ రేటును అందిస్తున్న పథకాలలో ఇదొకటని కొనియాడారు. ప్రజలు తమ పొదులపులను గత 103 సంవత్సరాలుగా బ్యాంకింగ్ సేవలందిస్తున్న మన ఎన్‌డీసీసీ బ్యాంకులో సురక్షితంగా పెట్టుబడి పెట్టి అధిక వడ్డీ ద్వారా తమ సంపదను మరింత భద్రంగా దాచుకోవటానికి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'ఎక్కువ వడ్డీ భద్రమైన పెట్టుబడి మెరుగైన భవిష్యత్తు' అనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు నాబార్డు మేనేజర్ ఎస్ ప్రవీన్‌కుమార్, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫూలే విగ్రహావిష్కరణ పోస్టర్ల విడుదల

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ పోస్టర్లను వాంకిడి సర్పంచ్ చూనార్కర్ సతీష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా వికాసం కోసం జీవితాంతం పోరాడిన జ్యోతిబా పూలే స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పేందుకే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూలే చూపిన విద్య, సమానత్వం, సామాజిక న్యాయం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఖమాన గ్రామంలో జూన్ 13న శనివారం సాయంత్రం 4.30 గంటలకు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువజన సంఘాలు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయ



వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారాం, నార్లపూర్ మాలి సంఘం పెద్దలు, వడై గౌరయ్య పటేల్, ఖమాన మాలి కులసంఘం నాయకులు మొహర్లే గంగాధర్, మొహర్లే నానాజీ, సోనూర్లే పెంటూ, అదే శంకర్‌తో పాటు డైలీ క్రికెట్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న పంచాయతీ సెక్రెటరీకి ఆప్యాయ సన్మానం

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని బన్సపెల్లి గ్రామ పంచాయతీ సెకక్రెటరీగా పనిచేసి బదిలీపై వెళ్లనున్న ప్రవళికకు గ్రామ సర్పంచ్ గడ్డం ముత్యంల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీ సెక్రెటరీ ఉత్తమ సేవలు అందించి గ్రామాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందించారని, అందరితో కలుపుగోలుగా ఉంటూ సేవలందించారని కొనయాడారు. అనంతరం ప్రవళిక మాట్లాడుతూ, తనకు ఈ ఉద్యోగం వచ్చిన రోజు నుండి ఇదే గ్రామంలో పనిచేసే అవకాశం రావడం, నా విధి నిర్వహణలో ప్రతి ఓక్కరు తమ ఇంటి బిడ్డగా సహాయ సహకారాలు అందంచారని , ఈ గ్రామాన్ని విడిచి వెళ్ళడం భాధగా ఉన్న ఉద్యోగరిత్యా తప్పడం



లేదని బావోద్వేగం చెందారు. ఈ కార్యక్రమంలో నూతనంగా వచ్చిన పంచాయతీ సెక్రెటరీ సౌందర్య వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పౌరాణిక నాటక రంగానికి గ్రామ సర్పంచ్ ప్రోత్సాహం

**ప్రజాపక్షం / నర్సాపూర్ (జి) :** గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయ కళలను పరిరక్షించడంలో భాగంగా గ్రామ సర్పంచ్ అల్లూర్ రాజేందర్ పౌరాణిక నాటక కళాకారులను ఘనంగా సన్మానించారు. శివపార్వతి వేషధారణలో ప్రేక్షకులను అలరించిన కళాకారులను ప్రశంసంసించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలు మన సంస్కృతికి అద్దం పడతాయి. యువత ఈ కళారూపాలను ఆదరించి ముందుకు తీసుకెళ్ళాలి అని అన్నారు. కళాకారులు కూడా గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందిస్తున్న ప్రోత్సాహం తమకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కళాభి



మానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళను కాపాడితే సంస్కృతి నిలుస్తుంది, అనే సందేశంతో నర్సాపూర్ (జి) గ్రామంలో మం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా ద్వారా విద్యార్థు ఎంపిక

**ప్రజాపక్షం / నిర్మల్ కలెక్టరేట్:** జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యా ప్రవేశాల కొరకు విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతలో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉచిత ప్రవేశ సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. లక్కీ డ్రాలో ఎంపికనైన వారికి శుభాకంక్షలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని చక్కగా చదువుకొని, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. లక్ష్మీ డ్రాలో ఎంపిక కాని వారు నిరాశ చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న సహాయ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సఅధికారి డి.లత, పోషకులు, ఇతర అధికారులు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి, ఎంబడి చంద్రశేఖర్

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** 2009 లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టం ఆర్టీ ను తెలంగాణలో ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. నిరుపేద, విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అందించేందుకు రూపొందించిన ఆర్టీ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నదున ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. నిర్మల్ జిల్లాలో ప్రవైటు విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అగ్నివీర్‌గా ఉద్యోగం సాధించిన యువకుడికి ఘన సన్మానం

**ప్రజాపక్షం /నర్సాపూర్-జి:** నర్సాపూర్ జి మండలం బూర్గుపల్లిజి గ్రామాని చెందిన తండ్రి జాదవ్ భరత్ తల్లి జాదవ్ సురేఖ దంపతుల రెండవ కుమారుడు జాదవ్ రామేశ్వర్ అనే యువకుడు భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## గంజాయిపై ఉక్కుపాదం

### రామకృష్ణాపూర్‌లో పోలీసుల ముమ్మర తనిఖీలు



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** పట్టణ పరిధిలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా పోలీసులు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవించడం, విక్రయించడం వంటి కార్యకలాపాలపై వచ్చిన సమాచారంతో అనుమానితుల ఇళ్లలో విస్తృతంగా శోధనలు చేపట్టారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ను వినియోగించి గంజాయి నిల్వలను గుర్తించే చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. గంజాయి సేవించే వారు, విక్రయించే వారు వెంటనే ఆ అలవాట్లను మానుకోవాలని, లేనిపక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గంజాయి రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ బృందం నిరంతరం నిఘా ఉంచుతోందని పేర్కొన్నారు. ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మురుగు కాలువ నిర్మాణంతోనే గ్రామాభివృద్ధి



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని ఖమాన గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ హాబిటేషన్‌లో గ్రామపంచాయతీ నిధులతో 150 మీటర్ల పొడవు గల సిసి డ్రెయిన్ నిర్మాణ పనులకు సర్పంచ్ గేడం సునీత శంకుస్థాపన చేశారు. ఈ డ్రెయిన్ ఉడుతల కిష్టయ్య ఇంటి నుంచి పెందోర్ జలపత్ ఇంటి వరకు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు మురుగు నీటి సక్రమ పారుదలకు ఈ సిసి డ్రెయిన్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఉపసర్పంచ్ లహు, వార్డు సభ్యులు సంగీత, ప్రవీణ్, రాము, భీము, విశ్వేశ్వర్, నిర్మలాబాయి, పెందోర్ లక్ష్మి , గ్రామపంచాయతీ కార్యదర్శి విలాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనీల్ జాదవ్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన, డిఇఒ

**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా నూతన డిఈఓ మండల విద్యాధికారి గా బాధ్యతలు చేపట్టిన మాధవి బుదవారం బోథ్ ఎమ్మెల్యే అనీల్ జావ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.నియోజకరవ్గంలో గల పలు పాఠశాలల గురించి చర్చించారు.



# మెడికల్ కళాశాలలో భారీగా బదిలీలు

**ప్రజాపక్షం/నిజామాబాద్‌:** మెడికల్ కళాశాలలో భారీ ఎత్తున వైద్యుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు డీఎంఈ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్ మెడికల్ కళాశాలలో మెడికల్ కాలేజీలో ట్రాన్స్‌ఫర్ అయిన డాక్టర్లు కళాశాలలో డాక్టర్లు, అసోసియేషన్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలు జరిగాయి. నిజామాబాద్ కళాశాల నుంచి రిలీవ్ అయిన వైద్యుల్లో మధు ప్రొఫెసర్, బాల్‌రాజ్, ప్రతిమారాజ్, జలగం తిరుపతిరావు, బీవీ నాగమోహన్, శివప్రసాద్, సయ్యదా అమ్తుల్ మోకీత్, వెంకటేశ్వరరావు, కెజె కిషోర్‌కుమార్, బి. శ్రీనివాస్, శ్రీనివాస్, విజయకుమార్, రవికిరణ్ ఉన్నారు. రిలీవ్ అయిన అసోసియేట్ ప్రొఫెసర్ల మంచాల స్వాతి, గడ్డం రాచెల్ రవీనా పాల్, రాజశేఖర్, గవాస్కర్, ఇమ్రాన్‌అలీ, సరస్వతి, హరీష్, స్వామి బదిలీ అయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు రోహిణి, భానుప్రియ, స్మిత వదన, రాజేందర్, రాజశేఖర్, సుజయ్ కుమార్, గంగారాం, బురుగుల కాత్యాయిని, హరికృష్ణ, నాగపద్మ, చంద్రమోహన్, రోదాసి, బాబురావు, శ్రీనివాస్ బదిలీ అయిన వారిలో ఉన్నారు. నిజామాబాద్‌కు వచ్చిన వైద్యులు నిజామాబాద్ మెడికల్ కళాశాలకు వైద్యులు ఎ.విశాల్, వెంకటేశ్వర్లు, దినేష్‌కుమార తానాజీ జాడే, మహ్మద్ యూసుఫ్‌ఖాన్ బదిలీపై వచ్చారు. అసోసియేట్ ప్రొఫెసర్లు తిప్పే స్వామినాయక్, కన్నయ్య ఉన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు వికాష్ రాథోడ్, మౌనిక, కమలాకర్ జిల్లాకు వచ్చారు.

# ఎడపల్లి మండలంలో ముగిసిన గ్రామ సభలు

### ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారుల హామీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలు విజయవంతంగా ముగిశాయి. మండల పరిధిలోని ఎమ్మెస్సి ఫారం, పోచారం, జాన్కంపేట్ తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన ఈ సమావేశాలు జరిగాయి. ఈ సభలకు మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులుగా హాజరై, స్థానిక సమస్యలపై గ్రామస్తులతో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న డ్రైనేజీ తాగునీరు, రోడ్ల మరమ్మతులు, ఇతర పౌర సేవలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులు స్పందిస్తూ గ్రామ సభలో లేవనెత్తిన సమస్యలను ప్రాధన్యత క్రమంలో పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఇటీవలే పాతదామ రాజు పల్లి రాఘవపేట గొర్రెపల్లి గ్రామాలలో మృతి చెందిన బాధిత కుటుంబాల సభ్యులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులను స్వయంగా కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనో ధైర్యాన్ని కల్పించారు. ఎమ్మెల్యే వెంటా బి.ఆర్.ఎస్ మండల శాఖ అధ్యక్షుడు తోట శ్రీనివాస్,మాజీ ఏఎంసీ చైర్మన్ కదుర్ల నరసయ్య,నాయకులు డీలర్ మల్లయ్య, బైరి రవికుమార్, అమీనుద్దీన్ సిద్దయ్య,రాజారెడ్డి తదితరున్నారు.

# పోలీస్ శాఖకు ప్రజల ప్రాణరక్షణ అత్యంత ప్రాధాన్యత

### తెలంగాణ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పిఅండ్ఎల్) డాక్టర్ గజరావు భూపాల్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పోలీస్ శాఖకు ప్రజల ప్రాణ రక్షణ అత్యంత ముఖ్యమని, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలంగాణ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పిఅండ్ఎల్) డాక్టర్ గజరావు భూపాల్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీరామ గార్డెన్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి డ్రైవర్ రహదారి భద్రతను తన వ్యక్తిగత బాధ్యతగా భావించి నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఆటో, లారీ, అంబులెన్సు, గూడ్స్ డ్రైవర్లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కంటి పరీక్షలు, చెవి పరీక్షల క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసిపి బి. ప్రకాష్ యాదవ్, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రమేష్ రాథోడ్, ఎన్ఎస్ఎస్ సెక్రెటరీ డాక్టర్ కవిత రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సిఐలు, ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు, ఐ రాడ్ జిల్లా మేనేజర్ హర్ష, లయన్స్ క్లబ్ వైద్యులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ ప్రతినిధులు, ఆటో యూనియన్ సభ్యులు, లారీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నమూనా పార్లమెంట్‌లో జాన్కంపేట్ బాలిక అద్భుత ప్రతిభ

### ప్రధానమంత్రి పాత్రలో ప్రశంసల జల్లు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ గ్రామానికి చెందిన కిశోర బాలిక రసజ్ఞ రాష్ట్ర స్థాయి నమూనా పార్లమెంట్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని చాటింది. మొదట జిల్లా కలెక్టరేట్‌లో గతంలో నిర్వహించిన పోటీల్లో మంత్రిగా బాధ్యతాయుతమైన పాత్రను పోషించి, అందరి ప్రశంసలతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అనంతరం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన రాష్ట్ర స్థాయి నమూనా పార్లమెంట్‌లో రసజ్ఞ ప్రధాన మంత్రి పాత్రను అద్భుతంగా పోషించింది. తన వాక్చాతుర్యం, నాయకత్వ లక్షణాలు, సమకాలీన సామాజిక సమస్యలపై ఉన్న అవగాహనతో సభను నడిపించి ప్రత్యేక గుర్తింపు సాధించింది. రసజ్ఞ చూపిన ప్రతిభకు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోర బాలికల సంఘాలు, స్నేహ బాలికా సంఘాలు, నమూనా అసెంబ్లీ కార్యక్రమాలు భవిష్యత్ మహిళా నాయకులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. టీనేజ్ బాలికల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ చట్ట సభల పనితీరు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారి హక్కుల పట్ల చైతన్య వంతులను చేయడం బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావం, మహిళల భద్రత వంటి కీలకమైన అంశాలపై విస్తృతంగా చర్చలు జరపడం ఈ కార్యక్రమాల లక్ష్యమని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొన్నారు. రసజ్ఞ సాధించిన ఈ విజయం నిజామాబాద్ జిల్లాలోని మిగతా బాలికలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కొనియాడారు. ఈ మేరకు జాన్కంపేట్ గ్రామస్తులు, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు రసజ్ఞ ప్రతిభ పట్ల అభినందనలు తెలియచేస్తున్నారు.

# వెల్లుల్ల గ్రామసభలో అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మెట్‌పల్లి డీఎస్పీ అద్దూరి రాములు, సీఐ సురేష్ బాబు,ఎస్ఐ పబ్బ కిరణ్ పాల్గొని రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, సీసీ టీవీ కెమెరాల ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ అద్దూరి రాములు మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, మహిళల హక్కులు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే విధానాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు భద్రత మెరుగుపడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి,వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.



# పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన రౌడీ షీటర్లు

**ప్రజాపక్షం / గంగాధర :** రౌడీ షీటర్లను సన్మార్గంలో నడిపేందుకు గంగాధర పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ అవగాహన పర్యావరణ పరిరక్షణ సందేశంతో వృక్షా రోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. అలాగే ప్రతి నెల కౌన్సిలింగ్‌కు హాజరయ్యేటువంటి సుమారు 15 మంది రౌడీ షీటర్లు, సస్పెక్టులతో కూడా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటించారు. వారిలో మార్పు తీసుకురావడానికి కౌన్సిలింగ్‌తో పాటు సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నారు.

అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలనే సందేశంతో వారిచేత మొక్కలు నాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ బర్ల మధుకర్

### స్వచ్ఛత గ్రామానికి ప్రతిరూపం : సర్పంచ్




**ప్రజాపక్షం/కోటగిరి:** మండల కేంద్రంలో బుధవారం ప్రజా పరిపాలనలో భాగంగా సర్పంచ్ బర్ల మధుకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎంపీడీఓ విష్ణు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ గ్రామ స్వచ్ఛత గ్రామానికి ఆదర్శమని, ప్రతిరోజు సమయం ప్రకారం చెత్తను స్వీకరించి స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తున్నామని గ్రామ సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలో మండల అధికారులు పాల్గొని గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయబ్ తహసీల్దార్ మధు, ఏఈ బుజ్జిబాబు, మండల వ్యవసాయాధికారి రాజు పాల్గొన్నారు.

# ఖండ్‌గావ్ గ్రామాన్ని సందర్శించిన ఆరోగ్యశాఖ బృందం



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఖండ్‌గావ్ గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎపిడెమిక్ బృందం డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సమత గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జ్వర సర్వే ఇంటింటి ఆరోగ్య పరిశీలన, ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

# పిఎంగా ఎక్కువ రోజులు మోదీ



**ప్రజాపక్షం/ముప్కాల్:** (మాజీ ప్రధాని జవహర్‌లాల్ రికార్డును అధిగమించి దేశంలో అత్యంత ఎక్కువ రోజులు ప్రధానిగా పని చేసిన సందర్భంగా బుధవారం ముప్కాల్ మండల బీజేపీ నాయకులు మర్రిచెట్టు దేవస్థానం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్, నిమ్మల శ్రీనివాస్, ముస్కు నర్సయ్య, దినేష్, నర్సయ్య, గోపినాథ్ పాల్గొన్నారు.

# మంగళ్‌పహాడ్ రెడ్డిక కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో రెడ్డిక కుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామంలోని కుల పెద్దలు, యువకులు అంతా కలిసికట్టుగా సమావేశమై ఈ నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బండ అభిలాష్, ఉపాధ్యక్షుడిగా పురం ప్రవీణ్, క్యాషియర్‌గా బండ లింగారెడ్డి, రైటర్‌గా బండ కృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కుల బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ప్రజాపక్షం/రాయపర్తి: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మండల సీనియర్ నాయకుడు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ రావు అనారోగ్యంతో మరణించగా ఆయన పార్థివ దేహానికి బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనుకుంట్ల మంజుల అశోక్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఆకుల సురేందర్ రావు, మాందాటి సుదర్శన్ రెడ్డి, కాంచనపల్లి వనజారాణి, ఎనగందుల మురళి, కళ్యాణ్ గౌడ్, కొండాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎండి ఖదీర్, గ్రామ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంగిరేకుల మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుడిపై దాడిని ఖండిస్తూ జూడా ఆధ్వర్యంలో నిరసన

ప్రజాపక్షం/శిలా వరంగల్: హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో జూన్ 7వ తేదీన రెసిడెంట్ వైద్యుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ కాకతీయ మెడికల్ కాలేజ్ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం ఆసుపత్రి, సికెఎం ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి పల్మనాలజీ ఆసుపత్రి, రీజినల్ ఐ హాస్పటల్ తదితర అనుబంధ ఆసుపత్రుల వివిధ విభాగాలకు చెందిన 500 మందికి పైగా వైద్యులు విధులు నిర్వహిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వైద్యులపై జరుగుతున్న దాడులు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యుల భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకోవాలని జూడా డిమాండ్ చేసింది. వైద్యులపై హింసాత్మక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత తీవ్రంగా స్పందిస్తామని జూడా హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జూడా రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ సాయి చందన్, జూడా రాష్ట్ర ఇంటర్న్స్ ప్రతినిధి డాక్టర్ లోకేష్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రమా, డాక్టర్ శివాని, డాక్టర్ మేఘనా, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తుకు భరోసా

### నర్సంపేట అర్బిట్ ఉమారాణి

ప్రజాపక్షం / నల్లబెల్లి: పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని వరంగల్ జిల్లా నర్సంపేట అర్బిట్ ఉమారాణి అన్నారు . బుధవారం నల్లబెల్లి మండలంలోని నాగరాజ్‌పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ ఎరుకల లలితరఘుణ అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో గ్రామ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు . ఈ సందర్భంగా అర్బిట్ ఉమారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతాని జాగ్రత్తలు తీసుకోవాలని ,ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేయాంచారు . గ్రామస్తుల సహకారంతో చేసుకోని గ్రామాభివృద్ధి చేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో నల్లబెల్లి తహసిల్దార్ రాంమూర్తి , పాల్గొన్నారు .

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య




ప్రజాపక్షం/రాయపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు ఉంటాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి గారే కృష్ణమూర్తి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యంతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు, కళాశాలకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, వారానికి మూడు రోజులు రాగి జావా వంటి సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు క్రీడా సామాగ్రిని అందిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపించి కష్టపడి సంపాదించిన డబ్బులు వృధా చేసుకోవద్దని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ ఎన్ సోమయ్య, కె.నవీన్ కుమార్, పి.రాజిరెడ్డి, డి.శ్రీనివాస్, ఏ.నాగరాజు, ఏ.బాలకృష్ణ, ఎం.రాజు, ఏ రాజేందర్, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌వి బి శర్మ, బి.ఉపేందర్, జి.ప్రవీణ్ రెడ్డి, సురేందర్, రోజా రాణి, రాధా కె శ్రీనివాస్, సంధ్య, సిఆర్‌పి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా ఓటు హక్కు నమోదు

### రెవెన్యూ అధికారి సుమ



ప్రజాపక్షం/రాయపర్తి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సుమ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రాయపర్తి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అనేది వజ్రయుధం అన్నారు. అధికారులు సమగ్రమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని అన్నారు. వరి కొయ్యలను కాల్చినట్లయితే భూసారం దెబ్బతింటుందని అన్నారు. దీని వలన పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా ఇతర పటల వైపు మొగ్గు చూపాలని అన్నారు. పంట మార్పిడి జరిగినప్పుడే భూమి సారవంతం అవుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఉన్నతమైన విద్య లభిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు కళ్యాణి విష్ణు, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన ట్రాఫిక్ భద్రతపై అవగాహన



ప్రజాపక్షం/గోవిందరావుపేట: పసర గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో డ్రగ్స్ నిర్మూలన రోడ్డు భద్రతపై నిర్వహించిన గ్రామ సభలో డ్రగ్స్ నిర్మూలన రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా పసర సీఐ దయాకర్ ఎస్ఐ తాజుద్దీన్ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు అలాగే ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతకు సంబంధించిన ట్రాఫిక్ వాల్ పోస్టర్లను విడుదల చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెల్మెట్ సీటుబెల్ట్ వినియోగాన్ని తప్పని సరిగా పాటించాలని సూచించారు అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీఐ దయాకర్ ఎస్ఐ తాజుద్దీన్ తదితరులు మొక్కలు నాటి పచ్చదనం పెంపుదలకు తమ వంతు బాధ్యతను చాటి చెప్పారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సుమలత పంచాయతీ కార్యదర్శి ఉపసర్పంచ్ సప్పిడి సంజన వార్డు సభ్యులు వివిధ శాఖల అధికారులు పత్రిక విలేకరులు గ్రామ ప్రజలు పెద సంఖ్యలో పాల్గొన్నారు గ్రామ సభలో ప్రజా సమస్యలు అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చించారు.

## మోదీ సుదీర్ఘ పాలనకు ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ మండలంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా సేవలందించిన ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచిన సందర్భంగా బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల అధ్యక్షురాలు నాయిని అనూష అశోక్ ఆధ్వర్యంలో రామలింగేశ్వరాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ప్రధాని మోదీకి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం సుసానం, సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవం, పేదల సంక్షేమ పథకాలు, రాంపల్లి రాజగోపాల్, కెక్కెర్ల అనిల్, అంబాల సుధీర్, కందుకూరి వెంకన్న, బొమ్మనపల్లి జయప్రకాష్, తక్కలపల్లి రాకేష్ రావు, నరేష్, భాస్కర్, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్

ప్రజాపక్షం/ నర్సంపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో పరిశుభ్రమైన వాతావరణం కోసం పచ్చదనాన్ని పెంపొందించడానికై నర్సంపేట ఏసిపి, మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, సిఐతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారే వరకు ప్రతి ఒక్కరూ దత్తత తీసుకుని నీరు పోస్తూ సంరక్షించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం తమ అందరిపై ఉందన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల నుంచి భూమిని కాపాడుకోవడానికి వృక్ష సంపద ఎంతో అవసరమని, భావితరాలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి పచ్చని పర్యావరణమే నన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామని, ప్రజలు తమ ఇంటి ఆవరణలో స్థలం ఉన్నచోట తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్,టౌన్ ఎస్సై గూడ అరుణ్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్స్ కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి ,పొన్నాల మనిషా ప్రకాష్, దొంగల రజిత,మాజీ ఎంపిటిసి కాట ప్రభాకర్,మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికం చదువుకు అడ్డుకాదు.. ప్రతిభకు విద్యాదాన్ చేయూత

ప్రజాపక్షం/నెక్కొండ: ఆర్థిక ఇబ్బందులు ఎంతో మంది విద్యార్థుల ఉన్నత విద్యా కలలను మధ్యలోనే ఆపేస్తుంటాయి. అలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాదాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం 2026 మరోసారి ముందుకొచ్చింది. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, చదువు మధ్యలో ఆగిపోకుండా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. తెలంగాణలో అర్హులైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ డిప్లొమా చదువుల కోసం స్కాలర్‌షిప్ అందించనుండగా, అనంతరం ఉన్నత విద్యకు మరింత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందే అవకాశం కల్పిస్తోంది. కుటుంబ పరిస్థితులు ప్రతిభకు అడ్డం కాకూడదనే సందేశంతో అమలవుతున్న ఈ పథకానికి జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మెరుగైన ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## ఇది ప్రజాపాలన కాదు... నియంత పాలన

ప్రజాపక్షం/ములుగు : అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేస్తారు. కానీ ఎన్నుకున్న ప్రజా ప్రతినిధి పేరు రాయరు. ఇది గౌరవమా, అవమానమా అంటూ ములుగు జిల్లా కౌన్సిలర్ బైకని అనూష సాగర్ ఆగ్రహంతో రగలిపోయారు. శిలాఫలకంపై తన పేరు నమోదు చేయలేదని, కౌన్సిలర్‌గా కనీస గుర్తింపు లేదని ఆరోపిస్తూ ఆమె గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కానీ వాటికి కనీస గౌరవం లేదని అధికారులు వారికి వారే ఒంటెద్దు పోకడతో శిలాఫలకాలు పెడుతున్నారు. ఎన్నుకున్న కౌన్సిలర్ పేరు రాయకుండా, మమ్మల్ని పూర్తిగా పక్కన పెడుతున్నారని అనూష సాగర్ మండిపడ్డారు. ఈ వ్యవహారం మొత్తం స్థానిక మంత్రి సీతక్క దృష్టికి రాకుండా జరుగుతుందా? అని ఆమె ప్రశ్నించారు. ఇంత పెద్ద జిల్లాలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిపై స్థానిక మంత్రికి తెలియదా? తెలిసి కూడా మౌనంగా ఉంటున్నారా? లేక కావాలనే మమ్మల్ని అవమానిస్తున్నారా? అంటూ నిలదీశారు. ఎన్నికైన ప్రతినిధుల గౌరవం, శిలాఫలకాలపై పేర్ల నమోదు వివాదం ఇప్పుడు ములుగు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక మంత్రి సీతక్క, జిల్లా యంత్రాంగం ఈ ఆరోపణలపై ఎలా అనే ఉత్కంఠ నెలకొంది.